
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



సిద్దిపేట 5

గురువారం 17 అక్టోబరు 2024

అకాల వర్షం.. అపార నష్టం 7

● దెబ్బతిన్న పంటలు.. పిడుగుపాటుకు కాడెద్దులు మృతి

ఉద్యోగంతో పాటు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ
- పోలీస్ సిబ్బందికి వార్షిక ఆరోగ్య పరీక్షలు



బ్లడ్ శాంపిల్ ఇస్తున్న సీపీ అనురాధ

నంగునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. బుధవారం నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని, ఆహారపు అలవాట్లలో మార్పు రావాలన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కలెక్టర్ మనుచౌదరి, సహకారంతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వార్షిక ఆరోగ్య పరీక్షలు వారంరోజుల పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోలీస్ శాఖలో హోంగార్డు నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతిఒక్కరి బ్లడ్ షాంపిల్స్ సేకరిస్తున్నారన్నారు. ఈ క్యాంప్ సందర్భంగా 56 రకాల టెస్టులు నిర్వహించి, రిపోర్టును బట్టి డీఎంహెచ్‌వో, నైపుణ్యం గల వైద్యాధికారుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇది ఒక పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును పోలీస్ నోడల్ అధికారి, ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్, ఆర్ఎస్ఐ వెంకటరమణ ప్రతిరోజూ మానిటర్ చేస్తామన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ప్రాజెక్టు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఆనంద్ తెలిపారు. పోలీస్ సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులకు కూడా వైద్య సేవలందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కొవిడ్ తర్వాత చాలామందికి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరిత, రూరల్ సీఐ శ్రీను, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణికుమార్, విష్ణుప్రసాద్, రాజేష్, పూర్ణచందర్, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, పోలీస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తలతో తిప్పలు



- పాఠశాల గోడలపై పాకుతున్న వైనం
- తరగతి గదుల్లో ఉండలేకపోతున్న విద్యార్థులు
- నివారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

7

ఆ తండ్రి తన ఇద్దరు కుమార్తెలు.. అల్లుడు.. మనవరాళ్లతో కలిసి బంధువుల ఇంట్లో జరిగే పండుగకు వెళ్లాడు. అంతా కలిసి ఆనందంగా గడిపి తిరుగు ప్రయాణమయ్యాడు. మనవరాళ్లతో.. బిడ్డలతో హాయిగా సాగుతున్న ఆ ప్రయాణం తనతో పాటు తన పిల్లలకు, వారి పిల్లలకూ చివరి ప్రయాణం అని ఏ మాత్రం ఊహించలేకపోయాడు.

ఒకే ప్రమాదంలో ఏడుగురు.. అందులో ఒకే కుటుంబానికి చెందిన వారు చనిపోయిన ఘటన మూడు తండాల్లో విషాదం నింపింది. వీరు ప్రయాణిస్తున్న మార్గంలో వెల్దుర్తి-ఉసిరికపల్లి వద్ద రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుపై గుంతలూ ఎక్కువగా ఉన్నాయి. ఈ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఆ గుంతల్లో పడి అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి.. ఎగిరి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న వాగులో పడిపోయింది. అంతా క్షణాల్లోనే జరిగిపోయింది.



మృత్యుఘోష



రోదిస్తున్న బంధువులు



మృతదేహాలు

చెట్టును ఢీకొట్టి.. వాగులోకి దూసుకెళ్లిన కారు.. ఏడుగురు మృతి

- ఎల్లమ్మ పండుగకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు
- భార్యాభర్త.. వారి ఇద్దరు కుమార్తెలు.. కుమార్తెల పిల్లలు దుర్మరణం
- ప్రమాదం నుంచి బయటపడ్డ అల్లుడు
- మూడు తండాల్లో విషాదం

శివ్వంపేట/నర్సాపూర్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం ఉసిరికపల్లి చౌరస్తా నుంచి వెల్దుర్తి వెళ్లే రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురిని మృత్యువు కబళించింది. వారంతా అల్లుడి కారులో సొంత డ్రైవింగ్‌తో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లితండాలోని బంధువుల ఇంట్లో జరిగిన ఎల్లమ్మ ఉత్సవాలకు మంగళవారం వెళ్లారు. బుధవారం తిరుగు ప్రయాణం కాగా మరో అరగంటలో నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండలం తాళ్లపల్లితండాకు చేరుకుంటారనగా ఈ ఘోరం చోటుచేసుకున్నది. కారు ఉసిరికపల్లి సమీపంలో మన్నెనోని వాగు వద్ద చెట్టును బలంగా ఢీ కొట్టి ఎగిరి పల్టీలు కొడుతూ వాగు నీటిలో పడింది. కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తుండగా డ్రైవింగ్ చేస్తున్న నాన్‌సింగ్ మాత్రమే తీవ్రగాయాలపాలై బయటపడ్డాడు.

(తరువాయి 7వ పేజీలో)

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేటటౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. పారిశుధ్య సమస్యలు, చెత్తబండి ఆలస్యంగా వస్తుందనే ఫిర్యాదులు పట్టణవాసుల నుంచి రావడంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన నాసర్‌పుర, ఇందిరమ్మ కాలనీ, కుషాల్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చెత్త వాహనం సమయానికి రావాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. లేదంటే చెత్తను జనాలు బయట పడేసే అవకాశం ఉందని చెప్పారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్త పడేస్తే గాలికి మురుగుకాలువల్లో పడి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కాబట్టి ఉదయం వచ్చే చెత్త వాహనానికి తడి చెత్త, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కుషాల్‌నగర్‌లో నివాసాల మధ్యలో ఉన్న పిచ్చి చెట్లను, చెత్త చెదారం తొలగించాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు.



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



సిద్దిపేటలోని జీజీహెచ్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం

సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌కు

మరో ఐదు పడకలు

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌లో మరో 5 పడకలు అందుబాటులోకి రానున్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నగరాలకు పరిమితమైన డయాలసిస్ కేంద్రాలు, తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ముందుగా 5 పడకలతో సిద్దిపేటలోనే డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యాయని ఆయన గుర్తుచేశారు. డయాలసిస్ అవసరమైన వారి సంఖ్య పెరగడంతో 2019లో 5 పడకలు, తాజాగా మరో 5 పడకలతో మొత్తం 15 పడకలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. హైదరాబాద్ వరకు వెళ్లి వ్యయప్రయాసలు పడి చికిత్స తీసుకోవాల్సిన బాధ తగ్గుతుందని, వ్యాధి పీడితులు సద్వినియోగం చేసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

రింగ్‌రోడ్డుకు మోక్షం

- ఎట్టకేలకూ ప్రారంభమైన పనులు
- రైల్వే అధికారుల ఆధ్వర్యంలో మొదలు
- పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- కోర్టు కేసు కారణంగా పాత ఆర్డీవో ఆఫీస్ వద్ద మరో 150 మీటర్ల పని పెండింగ్

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పనులకు ఎట్టకేలకూ మోక్షం లభించింది. పట్టణంలోని జాలిగామ రోడ్డులో గల రైల్వేస్టేషన్ వద్ద నిలిచిన కిలోమీటరున్నర పనులను రైల్వే శాఖ అధికారులు చేపట్టారు. కొన్ని రోజులుగా కోర్టు కేసులతో పనులు ఆగిపోయాయి. తాజాగా కోర్టు కేసు ముగియడంతో రైల్వే అధికారులు పనులను చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తవ్వాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. రూ.264 కోట్ల వ్యయంతో 21.92 కిలోమీటర్ల మేర చేపట్టిన రింగ్‌రోడ్డు పనులు ఇన్నాళ్లు ఆగుతూ సాగుతూ కొనసాగుతున్నాయి. రింగ్‌రోడ్డులో భాగంగా రైల్వేలైన్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)ని నిర్మించనున్నారు. ఈ నిర్మాణం పూర్తికి రైల్వే అధికారులు పనులను ముమ్మరం చేశారు.



గజ్వేల్‌లోని రైల్వేస్టేషన్ వద్ద అధికారులు చేపట్టిన రింగ్‌రోడ్డు పనులు


ట్రాఫిక్ సమస్యకు చెక్..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు ట్రాఫిక్ తిప్పలు తప్పనున్నాయి. భారీ, అతి భారీ వాహనాలు రింగ్ రోడ్డు గుండా వెళ్తే గజ్వేల్‌లో ట్రాఫిక్ తగ్గనుంది. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. ముంబై జాతీయ రహదారి, నాగపూర్ జాతీయ రహదారి నుంచి వచ్చే వాహనాలు నేరుగా రాజీవ్ రహదారి, భువనగిరి, చిట్యాల మీదుగా విజయవాడ హైవేకు వెళ్లనున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డులో గడిచిన కొన్ని ఏళ్లుగా రెండు చోట్ల పనులు పెండింగ్‌లో పడ్డాయి. సిటిజెన్స్ క్లబ్ (పాత ఆర్డీవో కార్యాలయం) వద్ద 150 మీటర్లు, రైల్వే ట్రాక్ క్రాసింగ్ వద్ద కిలోమీటరున్నర మేర రింగ్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణానికి రెండు వైపులా కనెక్టివిటీ లేకపోవడంతో భారీ వాహనాలు

మిగతా 8వ పేజీలో...

నామినేటెడ్ పందేరం

- 'హస్తం' నాయకులను ఊరిస్తున్న పదవులు
- కోహెడ ఏఎంసీ చైర్మన్‌కు ముగ్గురు పోటీ
- భర్తీకి మంత్రి పొన్నం కసరత్తు పూర్తి



రైతులకు ఇబ్బందులు రావొద్దు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రావొద్దని, ధాన్యం సేకరణ ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులకు డీఎస్‌వో తనూజశ్రీ, డీఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రైతు ఏ దశలోనూ ఇబ్బందులకు గురికాకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిందిగా ఆదేశించారు. ఈ జిల్లాలో వానాకాలంలో సుమారు 3.68 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని, దిగుబడి 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, దీనిలో రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్లుపోను 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇందులో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం, మిగతా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం వస్తుందని అంచనా అని తెలిపారు. ఈ ధాన్యం సేకరణ కోసం 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ స్కేల్, మాయిశ్చర్ మీటర్, డయల్ కాలిపర్, టార్పాలిన్లు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో 32 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, మిగతా అన్ని కేంద్రాలు కూడా రెండురోజుల్లో ప్రారంభం చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను సమకూర్చాలని డీఎంను ఆదేశించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పొలాల్లో బతుకమ్మ నిమజ్జనం!



తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా ఒక్కచోట చేరి పాటలు పాడుతూ ఆఖరికి చెరువుల్లోనో.. కుంటల్లోనో నిమజ్జనం చేస్తారు. కానీ జిల్లాలోని నాంచారుపల్లి గ్రామంలో బతుకమ్మలను పంటపొలాల్లో వదిలేశారు. అక్కడ నీరు పుష్కలంగా ఉందా అంటే అదీ లేదు. సద్దుల బతుకమ్మ ముగిశాక కూడా బతుకమ్మలు పొలాల్లోనే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని బతుకమ్మలు పొలం పక్కన నీరు లేని ప్రదేశంలో కనిపిస్తున్నాయి. చెరువులో నిమజ్జనం చేయకుండా ఇలా పొలాల్లో వదిలేయడం ఏంటని అటుగా వెళ్లే వాహనదారులు సంశయంగా చూస్తున్నారు.

సిద్దిపేట ఫొటోగ్రాఫర్, అక్టోబరు 16 : (ఆంధ్రజ్యోతి)

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అభివృద్ధికి వారధులుగా మారాలి

● డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అభివృద్ధికి వారధులుగా మారాలని డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం ఆకాంక్షించారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 22వ తేదీవరకు వారంరోజుల పాటు నిర్వహించే ప్రత్యేక శిబిరం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వలంటీర్లు వారి పరిజ్ఞానాన్ని రైతులతో పంచుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారి రవితేజ, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేషట్ డీన్ డా.నరేంద్రారెడ్డి, జిల్లా ఏరువాక కోఆర్డినేటర్లు రాహుల్, సరిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భూమికి భూమి.. లేదా ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సాపూర్, అక్టోబరు 16: తమ భూములు జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండటమే కాకుండా.. ఎకరాకు రెండుకోట్లకు పైగా పలుకుతుందని దానికి తగ్గట్టు పరిహారం ఇస్తేనే ట్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం భూములు ఇవ్వడానికి అంగీకరిస్తామని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట రైతులు బుధవారం ఆర్డీవో జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలు ట్రిబుల్ ఆర్ కోసం ఉన్న భూములు ఇస్తే ఎట్లా బతకాలన్నారు. పైగా ఇక్కడ భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రెండు కోట్లకు పైగా పలుకుతుండగా ఇప్పటికీ ఎంత ఇస్తారో స్పష్టత లేదని, అందువల్ల తమకు భూమికి భూమి లేదా ఎకరాకు రెండుకోట్లు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవోను కోరారు.

రేపు వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

● 19న క్రికెట్‌కు..

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18న సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సంగారెడ్డిలోని జిల్లా కోర్టు సమీపంలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో అండర్-17 బాలుర, బాలికల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు ఒరిజినల్ బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు వెయిట్ లిఫ్టింగ్ అయితే 9000609038, 9177250577, క్రికెట్‌కు సంబంధించి 6281440401, 95057966 88 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యార్థుల ధర్నా

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేటు విద్యాసంస్థల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, డివిజన్ నాయకులు అనిల్, సిద్ధేశ్వర్, సాత్విక్, శివ, దినేష్, శ్రీకాంత్, హర్షిత్, అశ్విని, పల్లవి, రోషిని, శ్రీనిధి, మల్లేశ్వరి, శర్మ, అనిల్, అశోకొరెడ్డి, ఉపేందర్; పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రాంత ప్రీతితోనే ప్రగతి

● వనరుల సృష్టితో ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు
● భవిష్యత్‌లో ప్రధాన టూరిజం స్పాట్‌గా సింగూరు
● వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ
● పలు మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనరసింహ

పుల్‌కల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాంతంపై ప్రీతి ఉంటేనే ప్రగతి సాధిస్తామని, వనరుల సృష్టితో ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక విద్యా శాఖల మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. పలుకల్ మండలంలోని శివంపేట గ్రామంలో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులో రూ.125 కోట్లతో నిర్మించతలపెట్టిన సమీకృత గురుకుల పాఠశాల భవన సముదాయ నిర్మాణ పనులకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ శెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతం విద్య, వైద్య రంగాల్లో వెనుకబడి ఉందని, వాటి అభివృద్ధికి కృషి చేసి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతానన్నారు. బస్వాపూర్ శివారులో సమీకృత గురుకుల పాఠశాలతో అనేక మార్పులు రానున్నాయన్నారు. భవిష్యత్‌లో సింగూరు ప్రాజెక్టు ప్రధాన టూరిజం స్పాట్‌గా మారనుందన్నారు. రూ.168 కోట్లతో సింగూరు కాలువల సిమెంటు లైనింగ్ పనులకు వారం పది రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. సన్నధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. జిల్లాలో 211 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఖరీఫ్ సీజన్‌లో 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, శిక్షణ కలెక్టర్ మనోజ్, డీఆర్‌డీవో జ్యోతి, డీసీవో కిరణ్‌కుమార్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య శివంపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ పల్లె సరోజసంజీవయ్య డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, పుల్కల్, చౌటకూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరత్, నాయకులు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, రాములు, ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాల ఏర్పాటు

నారాయణఖేడ్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే సత్వరం వైద్యమందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో రూ.కోటి 56 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జ హీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డిలతో కలిసి ప్రారంభించారు.

నియోజకవర్గానికి ఒక నర్సింగ్ కళాశాల

కంగ్టి , అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి ఒక నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్‌లో రూ.125 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణం పనులకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి శంకుస్థాపన

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో రూ.2.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించతలపెట్టిన కలెక్టర్ క్యాంపు కార్యాలయం భవన నిర్మాణానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుఘోష

చెట్టును ఢీకొట్టి.. వాగులోకి దూసుకెళ్లిన కారు.. ఏడుగురు మృతి

(ఐదో పేజీ తరువాయి)

వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారే అయిన పక్కపక్క తండాల్లో నివసిస్తున్నారు. శివ్వంపేట మండలం తాళ్లపల్లితండాకు చెందిన దనావత్ శివరామ్(55), దనావత్ దుర్గి(45) భార్యాభర్తలు. శివరామ్ కుమార్తె జగ్యతండాకు చెందిన మాలోత్ అనిత(30) ఆమె కుమార్తెలు మాలోత్ హిందు(14), మాలోత్ శ్రావణి(12). శివరామ్ మరో కుమార్తె బీమ్లాతండాకు చెందిన డ్రైవర్ నాన్‌సింగ్ భార్య గుగులోత్ శాంతి(38), వారి కుమార్తె గుగులోత్ మమత(16) చనిపోయింది. వారంతా వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవారు. కాగా మమత శివ్వంపేటలోని కస్తూర్బా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. ఈ ప్రమాదంతో మూడు తండాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



సంఘటన స్థలంవద్ద డీఎస్పీ తదితరులు

బంధువుల ఇంట్లో ఉత్సవానికి వెళ్లిన దనావత్ శివరామ్‌కు దుర్గి రెండో భార్య. ఇతని మొదటి భార్యకు మొత్తం నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు. దుర్గికి పిల్లలు కలుగలేదు. నలుగురు కుమార్తెల్లో మొదటి, రెండో కుమార్తె తండ్రి వెంట ఎల్లమ్మ పండుగకు వెళ్లారు. మిగిలిన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రాలేదు. అయితే అనిత భర్త మోహన్ లారీ డ్రైవర్ కాగా దావత్‌కు హాజరుకాలేకపోయాడు. దీంతో కుటుంబంలో ఆ ఒక్కడి ప్రాణాలైనా మిగిలాయి.

అతివేగం, మద్యం సేవించడమే కారణమా?

కారు నడుపుతన్న నామ్‌సింగ్ బంధువుల ఇంటి వద్ద నిర్వహించిన దావత్‌లో పాల్గొని మద్యం సేవించి కారు నడిపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అసలే ఆ రోడ్డు అధ్వానంగా ఉంటుంది.. ఆపై వేగంగా నడపడంతో పాటు నిర్లక్ష్యంతో కారు అదుపుతప్పి చెట్టును బలంగా డీకొట్టడం ఇంతమంది మృతికి కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. డ్రైవింగ్ చేసిన వ్యక్తి మద్యం సేవించాడా లేదా అనే విషయమ్మై కూడా విచారిస్తున్నట్లు తెలిపారు.



సంఘటన స్థలంవద్ద బంధువుల రోధన

మృతుదేహాలు తూప్రాన్ ఆసుపత్రికి తరలింపు

ఏడుగిరి మృతదేహాలను తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. కాగా గాయాలకు గురైన నామ్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టంకు గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

తాగిన మైకంలో యువరైతు ఆత్మహత్య



యాదయ్య (ఫైల్)

తొగుట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాగిన మైకంలో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం కాన్గల్ గ్రామంలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. తొగుట పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ముడికే యాదయ్య(40) మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు రోజు మాదిరిగా ఇంటి నుంచి వెళ్లిపోయిన యాదయ్య మద్యం తాగి అదే మత్తులో గ్రామ శివారులోని ముచ్చర్ల నరసయ్య వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. మృతుడి భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

కుటుంబ సమస్యలతో వివాహిత..



సౌమ్య(ఫైల్)

చేర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. వివరాల్లోకి వెళ్లితే చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన పెంటపర్తి సౌమ్య (22) కుటుంబ సమస్యలతో మనోవేదనకు గురవుతున్నది. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్ది పేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి 11 నెలల కూతురు, భర్త ఉన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

దుబ్బాక, అక్టోబరు16: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మిరుదొడ్డికి చెందిన సూకురి బాగయ్య(50) తన భార్య ఎల్లవ్వతో కలిసి ద్విచక్రవాహనంపై దుబ్బాక మండలం పెద్ద చీకోడు గ్రామానికి శుభకార్యం కోసం వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా స్థానిక పాత ఎల్లమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వారి బైకును ఢీకొట్టడంతో బాగయ్య అక్కడికక్కడే మృతి చెందగా, భార్య ఎల్లవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

మాసాయిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండల కేంద్రంలోని శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్ బంగారమ్మ ఆలయం సమీపంలో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తిని నిజామాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆసుపత్రికి తరలించారు.

కుప్పకూలి వ్యక్తి ..

శివ్వంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పశువులకు పచ్చి మేత కోయడానికి వెళ్లిన వ్యక్తి కుప్పకూలి మృతి చెందిన సంఘటన మండలంలోని చండి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొబ్బిలి మహిపాల్‌రెడ్డి(60) చండి శివారులోని తన పొలానికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి చూడగా అతడి మృతదేహం కనిపించింది.

ప్రణాళిక శాఖ పుస్తకం ఆవిష్కరణ

మెదక్ అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల్లో మన రాష్ట్రం ఎలా పురోగమిస్తోందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం-2024 తెలియజేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఛాంబర్ ప్రణాళిక శాఖ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యప్రణాళిక అధికారి బద్రీనాథ్, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళిక శాఖ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు

జిన్నారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లక్ష్మీబాయి 100వ పుట్టిన రోజు వేడుకలను బుధవారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. 1924లో జన్మించిన ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

చిన్న గ్రామంలో ఏడుగురికి టీచర్ ఉద్యోగాలు

రేగోడు అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్న గ్రామమైన మర్పల్లిలో ఒకేసారి ఏడుగురు టీచరు ఉద్యోగాలు సాధించి నియామక పత్రాలను పొందారు. గ్రామానికి చెందిన ఉల్లి అంబదాస్, చాకలి శ్రీశైలం, చాకలి అనూష, చిన్నం రామకృష్ణ, సున్నాయిల నవీన్, బంక లక్ష్మి, బండి నాగలక్ష్మి కొలువులు సాధించారు. ఈ విషయమై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రేగోడు పట్టణానికి చెందిన ముగ్గురు గొల్ల మహేష్ యాదవ్, ఆదిత్య గౌడ్, నరేష్ టీచర్ ఉద్యోగాలు సాధించారు.



టీచర్ పోస్టింగ్ ఆర్డర్‌ను అందుకుంటున్న మర్పల్లి గ్రామ అభ్యర్థులు

విగ్రహ ధ్వంసంపై ఆందోళన

● కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న భక్తులు

సదాశివపేట, సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ పట్టణం మాణిక్‌ప్రభు మందిరం ఆవరణలోని హనుమాన్ మందిరంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గణపతి దేవుడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం పూజల కోసం మందిరానికి వెళ్లిన భక్తులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ మహేష్‌గౌడ్ సిబ్బందితో కలిసి అక్కడి చేరుకుని ఘటన వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. గణపతి విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్, పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో భక్తులు, ప్రజలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నిందితులను 24 గంటల్లో అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రూపేష్‌కు వినతి పత్రం అందజేశారు.

పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

వర్గల్, అక్టోబరు 16 : మండలంలోని సింగాయిపల్లి గ్రామ శివారు లోని పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు కోకోజి వెంకటస్వామిని గౌరారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ నిందితుడు వెంకటస్వామి మంగళవారం రాత్రి మద్యం సేవించి పెద్దమ్మ తల్లి విగ్రహాలను ధ్వంసం చేశాడన్నారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అకాల వర్షం.. అపార నష్టం



గజ్వేల్ రూరల్ : కొడకండ్ల గ్రామంలో నేలకొరిగిన వరిపంట

గజ్వేల్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

పలు గ్రామాల్లో..

జగదేవ్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షానికి వివిధ గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. జగదేవ్‌పూర్, దౌలాపూర్, పీర్లపల్లి, ధర్మారం, మునిగడప తదితర గ్రామాల్లో పొట్టకు వచ్చి గొలుసు దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. చేతికందే సమయంలో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టంపై అంచనా వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

పిడుగుపాటుకు కాడెద్దులు మృతి

దౌల్తాబాద్, అక్టోబర్16 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రెండు కాడెద్దులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన రైతు గజ్వేల్ రాములుకు తన రెండు కాడెద్దులను మంగళవారం సాయంత్రం గ్రామ చివరన వేప చెట్టుకు కట్టేశాడు. బుధవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో వేపచెట్టుపై పిడుగు పడడంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షపైనే ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.



మృతి చెందిన ఎద్దులు



బడిలో గ్రామస్తులు ఏరిన నత్తలు

నత్తలతో తిప్పలు

● ముప్పిరెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల గోడలపై పాకుతున్న వైనం
● తరగతి గదుల్లో ఉండలేక విద్యార్థుల అవస్థలు

మనోహరాబాద్, అక్టోబర్ (ఆంధ్రజ్యోతి) 16: ప్రభుత్వ పాఠశాలలో నత్తల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ బడి పక్కనే అడవి ఉండడంతో పెద్ద ఎత్తున నత్తలు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. పాఠశాల ఆవరణ, గోడలకు ఎక్కడ చూసినా నత్తలే దర్శనమిస్తుండడంతో విద్యార్థులకు గదుల్లో ఉండలేక తిప్పలు తప్పడంలేదు. దీంతో బుధవారం కొందరు గ్రామస్థులు పాఠశాలకు చేరుకుని నత్తలను ఏరి కుప్పలుగా పోశారు. అంతేకాకుండా బడిలో తాగునీరు, మరుగుదొడ్ల వ్యవస్థ దుర్భరంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నత్తల నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు రింగ్‌రోడ్డు పనులు ప్రారంభం

5వ పేజీ తరువాయి..

పట్టణం నుంచే వెళ్తున్నాయి. ఫలితంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరగడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

రూ.264 కోట్ల వ్యయంతో 2016లో చేపట్టిన 21.92 కిలోమీటర్ల గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని నాలుగు లేన్లుగా నిర్మిస్తే, రింగ్‌రోడ్డుకు తూర్పు భాగంలో రాజీవ్ రహదారికి బైపా‌స్‌గా ప్రత్యేకంగా 6.4కిలోమీటర్ల మేర ఆరులేన్ల నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి కరీంనగర్, కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు నేరుగా మూడు ఫ్లైఓవర్ల మీదుగా వెళ్లిపోతున్నాయి. తొమ్మిది జంక్షన్లు, మూడు ఫ్లైఓవర్లతో సర్కిళ్లను అద్భుతంగా సుందరీకరించారు. కాగా పాత ఆర్డీవో కార్యాలయం వద్ద కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. దక్షిణ భాగం కనెక్టివిటీ పూర్తికావాలంటే కోర్టు తీర్పు వెలువడాలి.

జూనియర్ కళాశాల తనిఖీ

మిరుదొడ్డి, అక్టోబరు 16: మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఉన్నారు.

అక్కాతమ్ముడికి ఏఈఈ ఉద్యోగాలు

మిరుదొడ్డి, అక్టోబరు 16: మండలంలోని లింగుపల్లికి చెందిన జోగ్యారి బుచ్చవ్వ బాల్‌నర్సుల కుతూరు రాజేశ్వరీ, కుమారుడు చందులు ఏఈఈ ఉద్యోగాలు సాధించారు. వారిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం అభినందించారు.

జీపీ నిర్మాణాలు పూర్తయ్యేనా?

- 'స్థానిక' ఎన్నికల నాటికైనా అందుబాటులోకి వచ్చేనా ?
- రెండేళ్లుగా నత్తనడకన పనులు
- భవనాలు లేక రైతువేదికలు, అంగన్‌వాడీల్లో పంచాయతీ కార్యాలయాల కొనసాగింపు


లద్నూరులో పిల్లర్లకే పరిమితమైన జీపీ బిల్డింగ్ పనులు

మద్దూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలోని గ్రామ పంచాయతీల స్థానంలో నూతన గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా గుత్తేదారుల నిర్లక్ష్యం మూలంగా పనులు ముందుకు సాగడం లేదు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే నాటికైనా భవన నిర్మాణాలు పూర్తయి, నూతనంగా ఎన్నికయ్యే సర్పంచ్‌లకు పరిపాలన సౌలభ్యంలో ఇబ్బందులు లేకుండా చూస్తారో లేదోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీలు కొనసాగుతున్నాయి.

ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షలు

ఉపాధిహామీ పథకంలో రెండో విడుతలో ఒక్కో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గానూ రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. మొదటి విడతలో ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించగా నిధులు సరిపోనందున అదనంగా రూ.3 లక్షలు పెంచారు. దీంతో సలాఖ్‌పూర్, రేబర్తి, వల్లంపట్ల, కూటిగల్, తోర్నాల, బెక్కల్, దూళిమిట్ట, జాలపల్లి, అర్జున్‌పట్ల, కమలాయపల్లి, గ్రామాల్లో పనులు పూర్తవ్వగా, రెండో విడుతలో లింగాపూర్, ధర్మారం, మర్మాముల, లద్నూరు, వంగపల్లి, గాగిళ్లాపూర్ గ్రామాలకు పంచాయతీ నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో తమ హయాంలోనే ప్రారంభోత్సవాలు జరగాలన్న దృఢ సంకల్పంతో ఆగమేఘాల మీద పనులు పూర్తి చేయించి లింగాపూర్, మర్మాముల, ధర్మారం గ్రామాల్లో ప్రారంభోత్సవాలను చేశారు. వంగపల్లి, లద్నూరులో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గాగిళ్లాపూర్‌లో కేవలం శంకుస్థాపనకే పరిమితమైంది. లద్నూరులో రైతు వేదికలో, వంగపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామపంచాయతీల పరిపాలన కొనసాగిస్తున్నారు.


వంగపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

పోలీస్ బందోబస్తు నడుమ అంత్యక్రియలు

దూళిమిట్ట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానస్పదంగా మంగళవారం మృతి చెందిన బెక్కల్‌కు చెందిన భైరగోని యాదగిరిగౌడ్ అంత్యక్రియలు బుధవారంరాత్రి పోలీస్ బందోబస్తు మధ్య ముగిశాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు చేపట్టారు. బెక్కల్ గ్రామంతో పాటు, పొరుగు గ్రామం అనుమానితుడి ఇంటి వద్ద, గ్రామంలో దాదాపు 60 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి'


ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నరాములు

గజ్వేల్, అక్టోబరు 16: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నరాములు కోరారు. ఈ మేరకు గజ్వేల్ ఆర్డీవో బి.బన్సీలాల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020-21 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటివరకు విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టం అవుతుందని, అనేక ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. వారితో సామాజిక హక్కుల సంఘం(సహసం) జిల్లా అధ్యక్షుడు కానుగుల రమణాకర్, విద్యార్థులు ఉన్నారు.

ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్

హుస్నాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ 50 పడకల ఆసుపత్రిలో రోగులకు సరిపడా వైద్యులు లేకపోవడంలో ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆరోపించారు. సీపీఐ నాయకులతో కలిసి బుధవారం ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో నెల రోజులుగా బీపీ, షుగర్ మాత్రల కొరత ఉన్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫిజిషియన్ వంటి నిపుణులను నియమిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు అయిలేని సంజీవరెడ్డి, జనగామ రాజ్‌కుమార్, అయిలేని మల్లారెడ్డి, కుమారస్వామి, కనకస్వామి, జంగ విజయ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన బ్రాహ్మణ బంజేరుపల్లి గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో నర్సారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రె‌స్‌లో చేరారు. వారితో మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, కృష్ణారెడ్డి, సొక్కం సురేశ్ తదితరులున్నారు.

గజ్వేల్ మండలం పిడిచెడ్, మున్సిపాలిటీ పరిధిలోని వేములఘాట్, పల్లె పహాడ్ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అందజేశారు.

- **జగదేవ్‌పూర్:** మండలంలోని తిగుల్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యురాలు రాములమ్మ శ్రీరాంరెడ్డి, నాయకులు కేశపురం నర్సింహారెడ్డి, బాలకృష్ణారెడ్డి బుధవారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రె‌స్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్‌గుప్తా, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు లోకేష్, నాయకులు మహేందర్‌రెడ్డి, మనోజ్, కరుణాకర్, నర్సింహులు, బాలకృష్ణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పోలకమ్మ చెరువును గోదావరి జలాలతో నింపాలి

- కొమ్మూరికి గ్రామస్థుల వినతి

చేర్యాల, అక్టోబరు 16: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని పోలకమ్మ చెరువును గోదావరి జలాలతో నింపాలని కోరుతూ గ్రామస్థులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు అందె అశోక్, వెలుగల రఘువీర్, ఈరు భూమయ్య, ఆకుల రాజు తదితరులు కొమ్మూరిని కలిసి విన్నవించారు. పోలకమ్మ చెరువులో కేవలం వర్షాకాలంలోనే నీరు ఉంటుందని, కానీ రోజుల వ్యవధిలోనే అడుగంటిపోతుందని, తద్వారా రైతులు, గ్రామస్థులతో పాటు బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దూరు మండలం గాగిళ్లాపూర్ చెరువు నుంచి పల్లె వాగుద్వారా వచ్చే నీటిని రుద్రాయ పల్లివాగుపై చెక్ డ్యాం నిర్మించినట్లయితే గ్రామంలోని పోలకమ్మ చెరువులోకి నీరు చేరుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయచర్యలు చేపట్టి గోదావరి జలాలతో నింపితే ఆకునూరు, రాంపూర్, కాశీగుడిశెల ప్రజల ఇబ్బందులు తీరతాయన్నారు. దీంతో కొమ్మూరి సానుకూలంగా స్పందించారు.


కొమ్మూరికి వినతిపత్రం అందజేస్తున్న ఆకునూరు గ్రామస్థులు


విద్యార్థులకు ధ్రువపత్రాలను ప్రదానం చేస్తున్న డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు, అక్టోబరు 16: ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ స్థాయి విద్య అందేలా కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్సెస్సీ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా బుధవారం నంగునూరు మండలం నర్మెట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈసారి అత్యధిక శాతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారని తెలిపారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులతో, నిష్ణాతులైన అధ్యాపకులతో మంచి విద్యను అందిస్తున్నామని తెలిపారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దేశిరెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజూమ్


ప్రపంచ ఆహార దినోత్సవం సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అంజూమ్

గజ్వేల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆహారాన్ని వృథా చేయొద్దని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆహారం విలువ తెలుసుకుని ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు భవానీ, కవిత, మార్కండేయ, రామచంద్రం, జ్యోతి, తుమ్మ లావణ్య, అలివేలు, పద్మ, మహేందర్, మహేందర్‌రెడ్డి, నరేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

బీటీరోడ్ల కోసం రూ.15.41కోట్ల నిధులు మంజూరు

మద్దూరు/చేర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలోని మద్దూరు, బచ్చన్నపేట, జనగామ మండలంలోని పలు గ్రామాల్లో బీటీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.41 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్‌టీ నెం597 ప్రకారం ఉత్తర్వులు జారీ చేసింది. బచ్చన్నపేట మండలం బండనాగారం నుంచి కట్కూరు వరకు 5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.5.80కోట్లు, మద్దూరు మండలం లద్నూరు నుంచి వంగపల్లి గ్రామానికి 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం రూ.5.86 కోట్లు, జనగామ పట్టణంలోని సుందరయ్య నగర్‌లో 3 కిలోమీటర్లమేర రోడ్డు నిర్మాణం కోసం రూ.3.74కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి.

మేమంటే మేము

ఆయా గ్రామాల్లో చేపట్టనున్న రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధుల విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు భిన్న ప్రకటనలు చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతోనే మంజూరయ్యాయని బీఆర్ఎస్ శ్రేణులు, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రతిపాదనలతోనే మంత్రి సీతక్క ఆమోదించి నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా ప్రకటనలు చేశారు. నిధులు రావడానికి మేమంటే మేమే కారణమని సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెట్టడం చర్చనీయాంశమైంది.

శనిగరం ప్రాజెక్టు పంట కాలువల పరిశీలన

కోహెడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనిగరం గ్రామంలో మధ్య తరహా ప్రాజెక్టు నుంచి వెళ్లే పంట కాలువలను నీటి పారుదల, వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దార్ బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు చివరి భూములకు నీరు అందేలా పంట కాలువలను డీఈఈ రేష్మా, తహసీల్దార్ సురేఖ, ఏఈ రవిష్, ఏఎస్‌వో శ్రీనివాస్‌లు పరిశీలించారు. వీరివెంట ఆర్ఐ ఎల్లయ్య, ఏఈవో రైతులు ఉన్నారు.


తూమును పరిశీలిస్తున్న అధికారులు

బహిరంగ కొనుగోళ్లు జరుగుతున్నా పట్టించుకోరా?

- కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, అక్టోబరు 16: హుస్నాబాద్ పట్టణంలో వ్యాపారులు పత్తి, ధాన్యాన్ని బహిరంగ కొనుగోలు చేస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఒక్క అధికారి ఉండి బహిరంగ కొనుగోళ్లను నియంత్రించగా ప్రస్తుతం మార్కెట్ కార్యదర్శితో పాటు సూపర్‌వైజర్ ఉన్నప్పటికీ తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: తొగుట సీఐ లతీఫ్


కుకునూరుపల్లిలో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

కుకునూరుపల్లి, అక్టోబరు 16: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. కుకునూరుపల్లి జడ్పీ పాఠశాలలో బుధవారం డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తయ్య, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **కోహెడ:** మండలంలోని సముద్రాల ఆదర్శ పాఠశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు ఎస్ఐ అభిలాష్ షీటీం సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు.
- **ములుగు:** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కోరారు. ములుగు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని తునికిబొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, గజ్వేల్ షీటీమ్ బృందం సభ్యులు రాములు, కానిస్టేబుల్‌లు శ్యామల, రాంచంద్రారెడ్డి, మహేష్, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- **దుబ్బాక:** ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఎస్ఐ గంగరాజు సూచించారు. దుబ్బాకలోని సరస్వతీ గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యుత్ డీఈగా రాంచంద్రయ్య

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డివిజన్ విద్యుత్ నూతన డీఈ (డివిజనల్ ఇంజనీర్)గా కె. రాంచంద్రయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేటలో ఇంతకుముందు డీఈగా పనిచేసిన జి. మహేష్‌కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాంచంద్రయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

గజ్వేల్ రూరల్, అక్టోబరు 16: పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడు మహ్మద్ ఖదీర్‌కి గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు బుధవారం అందజేశారు. ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్ నందు అప్లోడ్ చేసి రికవరీ చేసి బాధితునికి అప్పగించామని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



కొండపాక మర్పడగ ఉన్నత పాఠశాలలో 1988-99లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

- కొండపాక

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు


రాయపోల్ ఎంఈవోకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నూతన ఉపాధ్యాయురాలు

మద్దూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 2024-డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు బుధవారం మద్దూరు మండలంలో విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీలు-6, లాంగ్వేజ్‌పండిట్-3, స్కూల్ అసిస్టెంట్స్-3 చొప్పున మొత్తం 13మంది విధుల్లో చేరినట్లు ఎంఈవో వరదరాజు తెలిపారు. ఆయనవెంట సీఆర్‌పీ శేఖర్ ఉన్నారు.

- **రాయపోల్:** రాయపోల్ మండలానికి నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డికి నియామక పత్రాలు అందజేశారు. ఇటీవల 25 మంది ఎస్జీటీలు బదిలీ కాగా 24 మంది నూతన ఉపాధ్యాయులు బదిలీపై వచ్చారు. ఇదిలా ఉండగా మరో 13 మంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే మండలానికి 9 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు రాగా మరో ఆరుగురు అవసరం ఉన్నది. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎంఈవో సూచించారు.

నామినేటెడ్ పందేరం

- హస్తం నాయకులను ఊరిస్తున్న పదవులు
- కోహెడ ఏఎంసీ చైర్మన్‌కు ముగ్గురు పోటీ
- భర్తీకి మంత్రి కసరత్తు పూర్తి

కోహెడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇక సీనియర్ నాయకులు రాష్ట్రస్థాయి పలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల హుస్నాబాద్‌కు చెందిన మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. తన గెలుపు కోసం, అలాగే పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన వారికి మంత్రి అవకాశం ఇస్తున్నట్లు తెలిసింది. కోహెడ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీల ఏర్పాటుకు మరో రెండు మూడు రోజులలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. హుస్నాబాద్ మార్కెట్ కమిటీకి చైర్మన్ జనరల్ కావడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడికి చెందిన రెడ్డి వర్గానికి చైర్మన్ పదవి దక్కనున్నట్లు తెలిసింది.

కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నిర్మల?

కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఐదు టర్మ్‌లకు డ్రా పద్ధతిన చైర్మన్‌ను ఎంపిక చేసింది. మెదటగా ఒక సంవత్సరం కోసం ఈ డ్రా తీసారు. తరువాత రెండు ఏళ్లకు పదవి పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొదటగా కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ జనరల్, రెండోసారి బీసీ మహిళ, మూడోసారి జనరల్, నాలుగోసారి జనరల్ మహిళ, ఐదోసారి ఎస్సీ మహిళకు డ్రా పద్ధతిన ఎంపిక చేసి కేటాయించారు. చివరిసారిగా జరిగే నామినేటెడ్ చైర్మన్ పదవికి ఎస్సీ మహిళకు దక్కనుంది. దీంతో కోహెడకు చెందిన ఎస్సీ నాయకులు బందెల సుజాత-బాలకిషన్, వేల్పుల త్రివేణి-వెంకటస్వామి, వరుకోలుకి చెందిన మాజీ ఎంపీటీసీ బోయిని నిర్మల- జయరాజు చైర్మన్ పదవి ఇవ్వాలని మంత్రికి విన్నవించుకున్నారు. పోటీ వద్దు ఏకగ్రీవం కోసం ప్రయత్నించాలని మంత్రి పొన్నం మండల ద్వితీయ శ్రేణి నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. బందెల సుజాత-బాలకిషన్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి వేల్పుల త్రివేణి -వెంకటస్వామికి మద్దతు తెలిపారు. ఈ ఇద్దరిలో మండల ద్వితీయ శ్రేణి నాయకులతో మంత్రి చర్చించి మాజీ ఎంపీటీసీ బోయిని నిర్మల జయరాజు పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. అలాగే వైస్‌చైర్మన్ పోస్టు కోసం చెంచల్ చెరువుపల్లికి చెందిన భీమిరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీరాములపల్లికి చెందిన దుర్గారెడ్డి పేర్లు వినబడినా తిరుపతిరెడ్డికే వైస్ చైర్మన్ పదవి దక్కనున్నట్లు తెలిసింది.

